‘స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగంపై చర్యలేవీ’

జనగామ టౌన్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా జిల్లాలో 20 మంది ఉపాధ్యాయులు స్పౌజ్ పాయింట్లను వక్రమార్గాన దుర్వినియోగం చేసినట్లు విచారణలో తేలినా వారిపై జిల్లా విద్యాశాఖ అధికారి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు సత్తయ్య, రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు ఉపాధ్యాయులకు కేవలం షోకాజ్ నోటీసులు జారీ చేశారని, వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

‘పోలీసులు ప్రజల్లో నమ్మకం కోల్పోవద్దు’

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేం.. వారు విశ్రాంతి లేని ఉద్యోగులు అలాంటివారు ప్రజల్లో నమ్మకం కోల్పోవద్దని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. రఘునాథపల్లి ఠాణా ఆవరణలోని అమరవీరుల స్తూపం వద్ద సోమవారం జిల్లా స్థాయిలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. డీసీపీ రాజమహేంద్ర నాయక్, జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో స్తూపానికి కలెక్టర్‌తో పాటు డీసీపీ పరిధిలోని పశ్చిమ జోన్‌కు చెందిన వివిధ మండలాల పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు. అమరవీరులకు గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అమరవీరుల పోలీసు కుటుంబాలకు సర్వత్రా రుణపడి ఉండాలన్నారు. పోలీసు అమరవీరుల ఆశయ సాధనకు సిబ్బంది కంకణ బద్దులు కావాలని, త్యాగాలకు సిద్ధంగా ఉండాలని డీసీపీ రాజమహేంద్ర నాయక్ వివరించారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ, వర్ధన్నపేట ఏసీపీలు భీం శర్మ, ప్రార్థసారథి, అంబటి నర్సయ్య, సీఐలు ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, దామోదర్ రెడ్డి, వేణు, మహేందర్ రెడ్డి, అబ్బయ్య, తహసీల్దార్ మోహిసిన్, స్థానిక ఎస్సై డి.నరేశ్, ఎస్సైలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


రఘునాథపల్లిలో పోలీసు అమరవీరుల స్తూపానికి పుష్పగుచ్ఛం సమర్పిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, డీసీపీ రాజమహేంద్ర నాయక్

ఈనాడు
జనగామ
మంగళవారం అక్టోబరు 22, 2024

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు సర్వం సిద్ధం

జనగామ టౌన్, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయడానికి జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేశాం.. కేంద్రాల వద్ద అన్ని మౌలిక వసతుల ఏర్పాట్లకు చర్యలు చేపట్టాం.. ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్(డీఎం) వాంకుడోత్ హథీరాం తెలిపారు. ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలు, ధాన్య సేకరణ లక్ష్యం, ఏర్పాటు చేసిన వసతులు తదితర వివరాలపై ‘న్యూస్‌టుడే’ సోమవారం డీఎం హథీరాంతో ‘ముఖాముఖి’ నిర్వహించింది.


వాంకుడోత్ హథీరాం, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్

ముఖాముఖి

? న్యూస్‌టుడే: జిల్లాలో కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు జరుగుతున్నాయా.. ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు?..

✓ **డీఎం హథీరాం:** జిల్లా వ్యాప్తంగా 180 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఇప్పటికే 43 ప్రారంభించాం. కొనుగోలుకు ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నాం.

? ఈ ఖరీఫ్‌లో ఎంత ధాన్యం సేకరించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు?..

✓ ఈ సారి ఖరీఫ్‌లో 2.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. 1.10 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం, 1.70 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం సేకరించాలని నిర్ణయించాం. ధాన్యం సేకరణకు గాను ఇప్పటికే జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ ఇచ్చాం.

? సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో జిల్లాలో సన్నాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారా?..

✓ సన్నాల సాగుపై వ్యవసాయ శాఖతో సమన్వయం చేసుకుని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వ నిర్ణయం మేరకు సన్నాల సాగుతో రానున్న రోజుల్లో రేషన్ దుకాణాల్లో కూడా సన్నబియ్యం ఇచ్చే ప్రక్రియ ప్రారంభం కానుంది. తద్వారా పీడీఎస్ బియ్యం దందా కూడా ఆగిపోనుంది.

? వర్షాలు ముంచుకొస్తున్నాయి, కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, రైతులకు ఎలాంటి ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు?..

✓ ప్రతి కొనుగోలు కేంద్రంలో 30 టార్పాలిన్లను అందుబాటులో ఉంచుతున్నాం. అవసరమైతే 50 వరకు కూడా సరఫరా చేస్తాం. ప్యాడీ క్లీనర్లు, తేమ యంత్రాలు అందుబాటులో ఉంచాం. సన్న రకాల ధాన్యం గుర్తించడానికి అవసరమైన యంత్రాలు గ్రెయిన్ క్యాలిఫర్స్, హస్క్ రిమూవర్ యంత్రాలు తీసుకొచ్చాం. సన్నాల గుర్తింపునకు వ్యవసాయ శాఖ ఏఈవో తోడ్పాటునందిస్తున్నారు.

? గన్నీ సంచుల కొరత ఉందా.. సన్నాలకు ఇచ్చే బోనస్ ధర రూ.500 అమలు తీరు ఎలా ఉండనుంది?..

✓ గన్నీ సంచులకు ఎలాంటి కొరత లేదు. మొత్తం 50 లక్షల గన్నీ సంచులు అవసరం. ఇప్పటికే 12 లక్షలు సిద్ధంగా ఉన్నాయి. అవసరం మేరకు సిద్ధం చేస్తాం. సన్నాలకు మద్దతు ధర విషయంలో ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాం. ప్రభుత్వ నిబంధనల మేరకు యథావిధిగానే బోనస్‌గా రూ.500 అందుతాయి.

? మద్దతు ధర, రైతులకు డబ్బుల చెల్లింపుల్లో ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారు?..

✓ మద్దతు ధర ప్రతి రైతుకు దక్కుతుంది. ఇందులో ఎలాంటి అనుమానం అవసరం లేదు. ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను ట్యాబ్‌లో నమోదు చేసి ట్రక్ షీట్ రాగానే పౌరసరఫరాల శాఖకు వచ్చిన 48 గంటల్లోగా ఖాతాలో డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకుంటాం. ఏ రోజు విక్రయాలను సంబంధించి ఆదే రోజు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

? సేకరించిన ధాన్యానికి నిల్వ గోదాములు అందుబాటులో ఉన్నాయా?..

✓ జిల్లాలో 77వేల టన్నుల ధాన్యాన్ని నిల్వ చేసుకునే సామర్థ్యం కలిగిన గోదాములు ఉన్నాయి. అయినా కూడా సేకరించిన ధాన్యం రైస్‌మిల్లులకు కేటాయిస్తుండటంతో నిల్వ ఇబ్బందులు రావు.

ఈ సన్నరకాలకే.. రూ.500 బోనస్ 6లో..

అర్జీలు ఇచ్చారు.. హామీలు పొందారు!


కలెక్టరేట్‌లో అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న పాలనాధికారి రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్

జనగామ, న్యూస్‌టుడే: వ్యక్తిగత, సామాజిక సమస్యల పరిష్కారం కోరుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు ప్రజావాణికి హాజరయ్యారు. జనగామ కలెక్టరేట్‌లో పాలనాధికారి రిజ్వాన్‌బాషా ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, పి.పింకేశ్‌కుమార్, ఆర్డీవోలు వెంకన్న, కొమురయ్య, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. దరఖాస్తుదారులు తమ సమస్యలను వివరించి, అర్జీలు సమర్పించగా, కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులు ఆయా శాఖల అధికారులకు సిఫార్సు చేసి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 40 అర్జీలు అందగా, అధికంగా రెవెన్యూకు సంబంధించినవి 25 ఉండటం గమనార్హం.

గ్యాస్ సబ్సిడీ లబ్ధి కోసం..



గృహజ్యోతి సబ్సిడీ కోసం దరఖాస్తు చేసినా లబ్ధి కలగలేదని, వినియోగదారు నెంబరు మ్యాచ్ అవడం లేదని తిప్పుతున్నారని ముద్రకోల శేషయ్య కుమారుడు సంకీర్త్ ఫిర్యాదు చేశారు. తల్లి, తండ్రి, తాను అనేక పర్యాయాలు మున్సిపల్, కలెక్టరేట్‌కు వచ్చి వినతి పత్రాలు ఇచ్చినా పరిష్కారం కాలేదని లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

శాఖల వారీగా వివరాలు

శాఖ	అర్జీలు
రెవెన్యూ	25
డీపీవో	4
పోలీస్, అబ్కారీ	4
ఇతర శాఖలు	7

ఏడేళ్లుగా బిల్లు కోసం..



వర్షాభావ ప్రాంతాల్లో రైతులకు విద్యుత్తు మోటార్ల సరఫరా పథకంలో 2018-19లో జిల్లా వ్యవసాయ అధికారి ఆర్డర్‌ను అనుసరించి రూ.9.94 లక్షల విలువైన మోటార్లను సరఫరా చేసినా బిల్లు మంజూరు కాలేదని మూడు ఏజెన్సీల పక్షాన ప్రతినిధి సుదర్శన్‌రెడ్డి కలెక్టర్‌కు సమస్య వివరించారు. ట్రెజరీ ఆంక్షల కారణంగా బిల్లు మంజూరు కాలేదని, సమస్యను కమిషనరేట్ దృష్టికి తీసుకెళ్లామని జిల్లా వ్యవసాయాధికారి రామారావు పాలనాధికారికి వివరించారు.

భర్త పింఛన్ తనకు ఇప్పించాలని..



జనగామ మండలం పెంబర్తికి చెందిన నిడిగొండ లక్ష్మినర్సమ్మ మరొకరు తోడుగా ప్రజావాణికి హాజరయ్యారు. భర్త, కుమారుడు మృతి చెందారని, ఆధార్‌కార్డులో తప్పును సవరించి, భర్త పింఛన్ తనకు ఇప్పించాలని వినతిపత్రం సమర్పించారు.

మరెన్నో సమస్యలు

రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్‌కు చెందిన కావటి కొమురమ్మ దివ్యాంగ సర్టిఫికెట్ రెన్యువల్ చేసి పింఛన్ వచ్చేలా చేయాలని కోరారు.

- నర్మెట్టకు చెందిన బిట్ల జ్యోతి తమ భూమి సర్వే ప్రక్రియను పూర్తి చేసి హద్దులు గుర్తించాలని కోరారు.
- బచ్చన్నపేట మండలం ఇటికాలపల్లికి చెందిన బి.ఓజాలు తన భూమికి మోకా విచారణ జరిపి, కొత్త పాసు పుస్తకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జనగామకు చెందిన పి.రామకృష్ణ పాడైన త్రిచక్ర వాహనం బదులుగా కొత్తది ఇవ్వాలని, ఇలా అనేక సమస్యలు ప్రజావాణి దృష్టికి వచ్చాయి.

సాగునీటి కాల్వ మరమ్మతుకు..



తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి బచ్చన్నపేట మండలం నారాయణపురం గ్రామానికి వేసిన సాగునీటి కాల్వ తెగిపోయిందని, మూడేళ్లుగా సమస్య పరిష్కారం కావడం లేదని గ్రామ రైతులు, నాయకులు వినతి పత్రం సమర్పించారు. వాగులోని నీరు తెగిన కాల్వ ద్వారా వృథాగా పోతోందని, పరిష్కారం చూపాలని విన్నవించారు.

కులగణన జరపాలని కలెక్టర్‌కు వినతి



జనగామ, న్యూస్‌టుడే: జనగామ వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ నియామకాన్ని రద్దు చేసి, రోస్టర్ ప్రకారం ఆ పదవిని బీసీ ఏ వర్గానికి కేటాయించాలని కోరుతూ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా సచివాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించి, పాలనాధికారి రిజ్వాన్‌బాషాకు వినతిపత్రం సమర్పించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో కమిటీ నాయకుడు బూడిది గోపి, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఏదునూరి మదార్ మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎలకంటి వెంకటేశ్, కళ్యాణం లింగం, కె.భాస్కర్, అవినాశ్ తదితరులు పాల్గొన్నారు. సమగ్ర కుల గణన చేసిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు జిల్లెల గణేశ్, బి.గోపి, మదార్, పి.చంద్రమౌళి, వీరన్న, కర్ణాకర్ పాల్గొన్నారు. అలాగే స్థానిక జిల్లా వైద్యాలయంలో సీటీ స్కాన్ యంత్రాన్ని ఏర్పాటు చేసి, సౌకర్యాలను అందుబాటులోకి తేవాలని జనగామ జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు ఆధ్వర్యంలో కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించినట్లు వారు ఒక ప్రకటనలో తెలిపారు. 8 ఏళ్లుగా ఈ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మోకాళ్లపై కూర్చొని వినతి చేయగా, కలెక్టర్ వారించారు. ఈ సన్నివేశాన్ని చిత్రీకరించబోగా పోలీసులు అడ్డుకున్నారు.

పోటెత్తిన తెల్లబంగారం



వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం తెల్లబంగారం పోటెత్తింది. సుమారు 10వేల పత్తి బస్తాలు మార్కెట్‌కు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సీజన్‌లో ఇంత మొత్తంలో పత్తి రావడం ఇదే తొలిశారన్నారు. పంట చేతికొస్తున్న తరుణంలో.. సోమవారం వరకు సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరుచుకోకపోవడంతో.. దిగుబడులు ఎక్కువగా వచ్చినట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. మార్కెట్‌లో సోమవారం క్వింటా పత్తికి గరిష్ఠ ధర రూ.7,100, కనిష్ఠ ధర రూ.5,500 పలికింది. పాత పత్తికి క్వింటా రూ.7,520 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

– న్యూస్‌టుడే, ఎనుమాముల మార్కెట్

కొలువుదీరిన జనగామ విపణి పాలకవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న మార్కెట్ కమిటీ నూతన అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సభ్యులు

జనగామ, న్యూస్‌టుడే: జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం బాధ్యతలను స్వీకరిస్తూ, ప్రమాణ స్వీకారం చేసింది. సోమవారం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. జిల్లా మార్కెటింగ్ అధికారి కమిటీ ప్రతినిధులతో ప్రమాణం చేయించారు. అధ్యక్షుడు బనుక శివరాజ్‌యాదవ్ బాధ్యతల స్వీకరించి సంతకం చేశారు. ఉపాధ్యక్షుడు కొల్లూరి నర్సింలు, సభ్యులుగా సభ్యులు-శీలం కొండల్‌రెడ్డి, బానోతు బన్ని, నామాల శ్రీనివాస్, బొట్ల నర్సింగరావు, బుర్రెడ్డి శ్రీలతారెడ్డి, మహ్మద్ బాషమియా, నీలం మోహన్, బండ కుమార్, తోటకూర రమేశ్, గాదె రమేశ్, వనపర్తి శ్రీనివాస్, నాగబండి రవీందర్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్, మార్కెట్ మాజీ ఛైర్మన్ కె.మహేందర్ రెడ్డి, కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, వ్యాపార, కార్మిక సంఘాల ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకు ముందు స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి, చౌరస్తా నుంచి మార్కెట్ యార్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి..

పదేళ్ల విరామం అనంతరం పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కార్యకర్తలు మమ్మల్ని గెలిపించారని, రానున్న స్థానిక ఎన్నికల్లో పల్లెల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు మేం మీకోసం పనిచేస్తామని సీఎం రేవంత్‌రెడ్డికి, పార్టీ నాయకత్వానికి మాటిచ్చామని, వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. ప్రమాణస్వీకారం అనంతరం మార్కెట్‌యార్డులో జరిగిన సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తర్వాత ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. జనగామలో అధ్యాపకుడిగా పనిచేస్తూ రాజకీయాల్లోకి ప్రవేశించానని, మచ్చలేని, నాయకుడిగా ప్రజల మన్ననలు పొందానన్నారు. నాడు మంత్రిగా నాటిన దేవాదుల పథకం నేడు ఈ ప్రాంత వరదాయినిగా మారిందని, అప్పుడు వరి సాగు అత్యల్పం కాగా, నేడు తెలుగు రాష్ట్రాల్లోనే అత్యధికంగా ఏటా 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండుతోందన్నారు. కాంగ్రెస్‌లో కొత్తగా చేరే వారితో సమష్టిగా పనిచేసి స్థానిక ఎన్నికల్లో అద్భుత విజయాలు సాధించాలని కోరారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడిన యువతను ప్రోత్సహించే క్రమంలోనే ప్రస్తుత మార్కెట్ కమిటీలో యువతకు ప్రాధాన్యమిచ్చామన్నారు. కాంగ్రెస్ పరిపాలనలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు దక్కుతున్నాయని వివరించారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ శివరాజ్‌యాదవ్, వైస్‌ఛైర్మన్ కొల్లూరి నర్సింలు మాట్లాడుతూ.. రైతుల శ్రేయస్సే లక్ష్యంగా సేవలందిస్తామని పేర్కొన్నారు. కమిటీ డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీని సన్మానించారు.

‘కల్వకుంట్ల కుటుంబం ఆస్తుల వివరాలు ప్రకటించాలి’ వివరాలు 6లో..


ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిలకు గజమాలతో సత్కారం


ర్యాలీకి ముందు కళాకారుల ప్రదర్శన

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి


జనగామ గురుకుల విద్యాలయంలో ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

జనగామ టౌన్, జనగామ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించడానికి తన శక్తివంచన లేకుండా పని చేస్తున్నానని వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఉపాధ్యాయులంతా ఓట్లు నమోదు చేసుకోవాలంటూ ఆయన సోమవారం జనగామలోని పలు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు కొరకు 2018 నుంచి నవంబర్ 2024 మధ్యన ఆరేళ్ల కాలంలో కనీసం మూడు సంవత్సరాలు విద్యా సంస్థల్లో పని చేస్తున్న వారంతా అర్హులన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రావు, నాయకులు శ్రీనివాస్‌రావు, సుధీర్‌రెడ్డి, నర్సయ్య, శ్రీనివాస్‌రావు, చంద్రమౌళి, వీరాంజని, వెంకటేశ్వర్లు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

టీజీ ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం


విద్యార్థికి ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ప్రిన్సిపల్ డా.బైరి ప్రభాకర్

మట్టెవాడ, న్యూస్‌టుడే: టీజీ ఎప్‌సెట్-2024 కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైనట్లు వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డా.బైరి ప్రభాకర్ తెలిపారు. సోమవారం వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల ప్రక్రియకు 423 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇంటర్(బైపీసీ) పూర్తి చేసి, టీజీ ఎప్‌సెట్‌కు అర్హత సాధించిన విద్యార్థులు బీఫార్మసీ, ఫామ్ డీ, ఫార్మాసుటికల్ ఇంజినీరింగ్, బయోటెక్నాలజీ తదితర కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఈ నెల 23 వరకు ధ్రువపత్రాల స్లాట్ ఎంచుకోవచ్చని వివరించారు. ఉదయం 9 గంటల నుంచి 6 గంటల వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుందన్నారు. సీట్ అలాట్‌మెంట్ 28న జరుగుతుందని, ఈ నెల 30న ప్రవేశం పొందిన కళాశాలలో చేరాలని సూచించారు.

డిప్యుటేషన్‌పై డీఈల బదిలీ

జనగామ, న్యూస్‌టుడే: జనగామ మున్సిపల్ పరిధిలో అధికారుల డిప్యుటేషన్ల పరంపర, వారంలో మూడు రోజుల విధుల విధానం కొనసాగుతోంది. జనగామ మున్సిపల్ గతంలో ఇక్కడ పూర్తి స్థాయి డీఈగా ఉన్న చంద్రమౌళి ఏడు మాసాల క్రితం రామగుండం బదిలీ కాగా, ప్రజారోగ్య శాఖ డీఈ శ్రీనాథరెడ్డి ఇక్కడికి వచ్చారు. వారంలో మూడు రోజుల ప్రాతిపదికన ఆయన పనిచేసి బదిలీ అయ్యారు. పక్షం రోజుల క్రితం వరంగల్ ప్రజారోగ్య శాఖ నుంచి రాజ్‌కుమార్ డీఈగా వచ్చారు. అమృత్ 2.0 పథకం ప్రత్యేక ప్రణాళికల తయారీలో ఆయన సేవలు అవసరమని డిప్యుటేషన్‌పై వరంగల్‌కు బదిలీ చేశారు. రామగుండం డీఈగా వెళ్లిన చంద్రమౌళికి వారంలో మూడు రోజులు ప్రాతిపదికన జనగామ పురపాలికకు డిప్యుటేషన్ ఇచ్చారు. ప్రస్తుతం మున్సిపల్ ఎంఈ మూడు రోజులు జనగామలో మూడు రోజులు హైదరాబాద్‌లో పని చేస్తున్నారు.



బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త జనులకు నా క్లయింట్ అయినా చైతన్య ఎమర్జింగ్స్ హైదరాబాద్ గారు తెలియజేయునది ఏమనగా వరంగల్ పట్టణము, ఖిలా వరంగల్ మండలము మరియు గ్రామములోని సర్వే నెంబర్ 1680, 1693 పాతవి 1210, 1200 కొత్తవి దీనిలో గల ఇంటి నెంబర్లు 16-3-1005, 16-3-1006, 16-3-1009, 16-3-1010 మరియు 16-3-1011 గల గోడౌన్ మరియు ఖాళీ స్థలం 13805 చదరపు గజముల స్థలమును అనగా ఇందు షెడ్యూల్ దాఖల ఆస్తి అపార్ట్మెంట్‌గా అభివృద్ధి చేయుటకు గాను నా క్లయింట్ వరంగల్ పట్టణం శివనగర్ నివాసులైన **మందలపు రామయ్య, మందలపు పిచ్చమ్మ, మందలపు కోటేశ్వర్‌రావు, మందలపు లక్ష్మణ్‌రావు, మందలపు సూర్యనారాయణరావు, మువ్వ వెంకట్రావమ్మ, చంద్ర భూలక్ష్మి, చదలవాడ కోటీశ్వరి, యార్లగడ్డ రాణి** మరియు **ఆకుల నాగరాజు** గార్లతో రిజిస్టర్డ్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కం పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజు నెంబర్లు 58/2019, 59/2019, 9009/2019, 10957/2019 మరియు 5746/2020 పొంది ఉంటిరి అవి అన్నియూ కూడా సబ్ రిజిస్టర్ ఫోర్ట్ వరంగల్ వద్ద రిజిస్టర్ కాబడినవి ఆ రోజు నుండి షెడ్యూల్ దాఖల ఆస్తి రిజిస్టర్ దస్తావేజుల ద్వారా నా క్లయింట్‌కు రిజిస్ట్రేషన్ కలవు. కానీ కొందరు వ్యక్తులు నా యొక్క క్లయింట్ యొక్క ప్రమేయము లేకుండా ఇతరులకు అమ్ముటకు లేదా ఇతరత్రా లావాదేవీలు చేయుటకు గాను ప్రయత్నాలు చేయుచున్నారని నా క్లయింట్ విశ్వసనీయంగా తెలియవచ్చినది. కావున ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిపై ఎవరు కూడా ఎలాంటి లావాదేవీలు చేయకూడదని చేసిన చెల్లనేరవని మరియు నా క్లయింట్ తీసుకోబోవు చట్టపరమైన చర్యలకు బాధ్యులు అవుతారని ఇందుమూలముగా హెచ్చరించనైనది.

షెడ్యూల్ ఏ: వరంగల్ పట్టణంలో గల ఖమ్మం రోడ్డు వైపున ఉన్నటువంటి విద్యానగర్ కాలనీలోని సర్వే నెంబర్ 1200 మరియు 1210 పాత సర్వేనెంబర్ 1683 మరియు 1693 ఇంటి స్థలము గోడౌన్ భవనము ఇంటి నెంబర్ 16-3-1006లో 3000 చదరపు గజముల స్థలము ఈ దిగువ హద్దులతో కలదు. **తూర్పు:** అంకల రామచంద్రరావు మరియు పి.మల్లేశం గారి ఇంటి స్థలము, **పడమర:** ఎం.లక్ష్మణరావు గారి గోడౌన్ స్థలము, **ఉత్తరము:** భాస్కరాచారి మరియు మాధవాచార్ గార్ల ఇల్లు, **దక్షిణం:** ఎం.కోటేశ్వరరావు గారి గోడౌన్ మరియు ఉమ్మడి దారి.

షెడ్యూల్ బి: వరంగల్ పట్టణంలోని ఫోర్టు వరంగల్‌లో గల సర్వే నెంబర్ 1200 మరియు 1210 పాతవి 1683 మరియు 1693లలో గల గోడౌన్ మరియు ఖాళీ స్థలం ఇంటి నెంబర్ 16/360/డి పాతవి 16-3-1010 కొత్తదిలో గల 3506.77 చదరపు గజములు స్థలము ఈ దిగువ హద్దులతో కలదు. **తూర్పు:** ఎం.కోటేశ్వర్‌రావు గారి గోడౌన్, **పడమర:** ఇతరుల ఖాళీ స్థలము, **ఉత్తరము:** రోడ్డుకు చేరు ఉమ్మడి దారి, **దక్షిణం:** ఉమ్మడి దారి తర్వాత ఇతరుల స్థలము.

షెడ్యూల్ సి: వరంగల్ పట్టణంలో గల ఖమ్మం రోడ్డు వైపున ఉన్నటువంటి విద్యానగర్ కాలనీలోని గోడౌను బిల్డింగు ఇంటి నెంబర్ 16-3-1009, సర్వే నెంబర్ 1200 మరియు 1210 పాత సర్వేనెంబర్ 1683 మరియు 1693 ఇంటి స్థలములోని 3552 చదరపు గజముల స్థలము ఈ దిగువ హద్దులతో కలదు. **తూర్పు:** ఎం.సూర్యనారాయణరావు గారి గోడౌన్, **పడమర:** రామగిరి వినయ్‌కుమార్ మరియు ఆర్.బిక్షపతి గార్ల ఖాళీ స్థలం, **ఉత్తరము:** పుప్పాల రవీందర్ మరియు తడక రవి గార్ల ఇల్లులు, **దక్షిణం:** 30 ఫీట్ల ఉమ్మడి దారి.

షెడ్యూల్ డి: వరంగల్ పట్టణంలోని ఫోర్టు వరంగల్‌లో గల సర్వే నెంబర్ 1200 మరియు 1210 పాతవి 1683 మరియు 1693లలో గల గోడౌన్ మరియు ఖాళీ స్థలం ఇంటి నెంబర్ 16-3-1005లో గల 3077 చదరపు గజములు స్థలము ఈ దిగువ హద్దులతో కలదు. **తూర్పు:** పిచ్చమ్మ గారి ఇల్లు ఇంటి నెంబర్ 16-3-1011, **పడమర:** వెంకటరామయ్య మరియు ఇతరుల ఇంటి నెంబర్ 16-3-1010 గల గోడౌన్, **ఉత్తరము:** ఉమ్మడి దారి తరువాత సూర్యనారాయణ గారి యొక్క గోడౌన్ ఇంటి నెంబర్ 16-3-1006, **దక్షిణం:** కె.సునీత మరియు ఇతరుల ఇంటి నెంబర్ 16-3-1014/బి గల ఇల్లు.

షెడ్యూల్ ఇ: వరంగల్ పట్టణంలో గల ఖమ్మం రోడ్డు వైపున ఉన్నటువంటి విద్యానగర్ కాలనీలోని ఇల్లు మరియు ఇంటి స్థలం, ఇంటి నెంబర్ 16-3-1011, సర్వే నెంబర్ 1200 మరియు 1210 పాత సర్వేనెంబర్ 1683 మరియు 1693 ఇంటి స్థలములోని 669.08 చదరపు గజముల స్థలము ఈ దిగువ హద్దులతో కలదు. **తూర్పు:** 100 ఫీట్ల ఖమ్మం రోడ్డు, **పడమర:** ఎం.కోటేశ్వర్‌రావు గారి గోడౌన్, **ఉత్తరము:** రోడ్డుకు వెళ్ళు ఉమ్మడి దారి, **దక్షిణం:** ఇతరుల ఇల్లు.

తేది: 19-10-2024

ఇట్లు సం/- పద్మ అరవింద్, B.Sc., LL.B., అడ్వకేట్
H.No. 8-11-180, P.N.B. Lane, J.P.N. Road, Warangal, Cell: 9849152264

విరులు.. లాభాల సిరులు



నర్సంపేట, ఎల్కతుర్తి, న్యూస్‌టుడే : బంతి పూల సాగు లాభదాయకంగా ఉండటంతో పలువురు రైతులు ఈ సాగుపై మక్కువ చూపుతున్నారు.. స్వల్ప పెట్టుబడి.. తెగుళ్లు, చీడపీడల బాధలు తక్కువే.. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం రాజపల్లిలో ఎడ రమేశ్ ఎకరం భూమిలో, హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్లభాపూర్‌లో రైతు అంబాల కరుణాకర్ ఎకరంలో బంతి సాగు చేశారు. దసరా, దీపావళి పండగల నేపథ్యంలో మార్కెట్‌లో ఆశించిన ధర పలుకుతోంది. రమేశ్ తన మిత్రుడి సాయంతో గత జులైలో ఈస్ట్‌వెస్ట్ కంపెనీకి చెందిన బంతి విత్తనాన్ని బెంగళూరు నుంచి తెప్పించి నారు పోసినట్లు తెలిపారు. నారు పోసిన 25 రోజుల తర్వాత మొక్కలు నాటారు. అంతరకృషి, మొక్కలకు ఎరువులు వేశారు. 52 రోజులకు రెక్కల పురుగు నివారణకు పురుగు పిచికారీ చేశారు. పూలు మొత్తం నాలుగు కోతలు వస్తాయి. మొదటి కోత తొలి బతుకమ్మ(అమావాస్య)కు కోయగా దిగుబడి టన్నున్నర వచ్చింది. కిలో రూ.80 ధర పలికింది. సద్దుల బతుకమ్మకు రెండో కోత మూడు టన్నుల దిగుబడి రాగా, ధర రూ.60-70 వరకు ధర పలికింది. ఈ రెండు విడతలో దాదాపు రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చిందని రైతు రమేశ్ వివరించారు.

ఆదర్శం



తోటలో పనులు చేస్తున్న రమేశ్ దంపతులు

రూ.2.5 లక్షలు వస్తాయని అంచనా..

-అంబాల కరుణాకర్, రైతు



రెండేళ్ల నుంచి బంతి సాగు చేస్తున్నాను. సుమారు రూ.3 లక్షల ఆదాయం వస్తుందని అంచనా.. పెట్టుబడి రూ.50వేలు పోగా రూ.2.5 లక్షలు చేతికి వస్తాయి..

ప్రశ్న- సమాధానం

? పత్తి పంటలో ఆకులు నల్లగా మారుతున్నాయి. ఎండిపోయి రాలుతున్నాయి. నివారణ చర్యలు తెలపండి..? -రైతు, రావుల లక్ష్మయ్య, సూధన్‌పల్లి.

✔ బ్యాక్టీరియాతో ఆకులు నల్లగా మారుతున్నాయి. కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, స్ట్రెప్టోసైక్లిన్ రెండు గ్రాముల మందును 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పంట ఎదుగుదలకు ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను నేల ద్వారా మొక్కలకు అందించాలి. పైపాటుగా లీటరు నీటికి 10 గ్రాముల యూరియా స్థూల పోషకాల మిశ్రమాన్ని వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

-డా.రాజు, శాస్త్రవేత్త, కేవీకే వరంగల్

-వరంగల్ వ్యవసాయం



రైతేరాజు

ఈ సన్నరకాలకే.. రూ.500 బోనస్!



పాకాల ఆయకట్టులో సాగవుతున్న సన్నవరి

ఖానాపురం, గోపాలపూర్, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం వరి పండించే రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే.. అయితే, ఏయే రకాలకు బోనస్ ఇస్తారో తెలియక అన్నదాతలు అయోమయంలో ఉన్నారు. ఇటీవల ఆయా రకాల జాబితాను వ్యవసాయ శాఖకు ప్రభుత్వం విడుదల చేసింది. 33 రకాల సన్నాల వరికి బోనస్ ఇవ్వనున్నట్లు ప్రకటించారని వ్యవసాయాధికారి భోగ శ్రీనివాస్ 'రైతేరాజు'కు తెలిపారు. సిద్ధి(డబ్ల్యూజీఎల్44), కేపీఎస్ 2874(కంపాసాగర్ వరి-1), సాంబమశూరి, జగిత్యాల వరి-3, జగిత్యాల వరి-2, వరంగల్ సాంబ(వరంగల్ 14), వరంగల్ సన్నాలు, జగిత్యాల మసూరి, పొలాస ప్రభ(జేజీఎల్384), క్రిష్ణ(ఆర్ఎన్నార్2458), మానేరు సోన, తెలంగాణ సోన(ఆర్ఎన్నార్ 15048), వరంగల్ వరి-1119, కూనారం వరి-2, వరంగల్ వరి-2, రాజేంద్రనగర్ వరి-4, కూనారం వరి-1, జగిత్యాల సన్నాలు, జగిత్యాల సాంబ, అంజన(జేజీఎల్ 1118), నెల్లూరు మసూరి, ప్రద్యుమ్న, సుగంధ సాంబ, శోభిని, సోమనాథ్, ఆర్ఎన్నార్, కేపీఎస్ 6261, జేసీఎల్ 33124, హెచ్ఎంటీ సోన, మారుటేరు సాంబ, మార్టేరు మసూరి, ఎంటీయూ 1271 రకాల జాబితాలో ఉన్నాయి. వీటితో పాటు సన్నాలుగా ఉండి 6 మి.మీ. పొడవు, వెడల్పు 2 మిల్లీమీటర్ల కన్నా తక్కువగా ఉన్న పరిమాణాన్ని పరిగణలోకి తీసుకొని సన్నరకాలను గుర్తించి బోనస్ చెల్లిస్తారు. ధాన్యం కొనుగోలు సందర్భంగా వ్యవసాయాధికారులు వెర్నియర్ కాలిపర్ ద్వారా సూక్ష్మ కొలతలు గణించి ప్రతి వడ్ల కుప్పను పరిశీలించి నిర్ధారణ చేయనున్నట్లు పేర్కొన్నారు. కాగా రైతు పండించిన పంట మొత్తాలకు బోనస్ ఇస్తారా..? రైతు భరోసాకు ఇచ్చే కటాఫ్ ఎకరాలకు ఇస్తారో ఇంకా నిర్ణయించలేదు.

-న్యూస్‌టుడే వరంగల్ వ్యవసాయం

రైతుకు భరోసా.. మాన్‌ధన్ యోజన



కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన ద్వారా వయసు పై బడిన రైతులకు సామాజిక భద్రత కల్పిస్తోంది. గరిష్ఠంగా రెండు హెక్టార్లు(5 ఎకరాలు)లోపు సాగు భూమి ఉండి 18-40 ఏళ్ల లోపు ఉన్న వారు అర్హులు.. ఆదాయపన్ను చెల్లింపుదారులు, ఉద్యోగులు, వైద్యులు, న్యాయవాదులు, ఇంజినీర్లు ఇతర వృత్తి నిపుణులు దీనికి అనర్హులు. ప్రతి నెలా చెల్లిస్తున్నవారు, నిర్ణయించిన దాని కంటే అధిక రాబడి పొందుతున్నవారు, ప్రభుత్వ పథకాల లబ్ధి పొందినవారు కూడా పథకంలో చేరడానికి వీల్లేదు.. రైతులు కామన్ సర్వీసు కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలి. పాసో, నివాస, ఆధార్, ధ్రువీకరణ, వయసు నిర్ధారణ, సాగు భూమి పత్రాలు, ఆధార్ కార్డు సమర్పించాలి. పీఎంకేఎం పోర్టల్‌లో నమోదు చేశాక చరవాణి నంబరుకు సందేశం వస్తుంది. ప్రత్యేకంగా పింఛను ఖాతా తెరిచి కార్డు ఇస్తారు. ఇందుకైన ఖర్చు రూ.30లను ప్రభుత్వమే చెల్లిస్తుంది.

వయసు ఆధారంగా ప్రీమియం : పథకంలో చేరిన రైతులు వయసును బట్టి ప్రీమియం డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. 18 ఏళ్ల వారు నెల వారీ రూ.55 చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం రూ.55 కలిపి బీమా కంపెనీకి రూ.110 చెల్లిస్తుంది. ఏటా వయసును బట్టి ప్రీమియం రూ.3 నుంచి రూ.10 వరకు పెరుగుతుంది. 40 ఏళ్లు పైబడిన వారు రూ.200 చెల్లించాలి. ఇంతే మొత్తం ప్రభుత్వమూ చెల్లిస్తుంది. 60 ఏళ్లు వచ్చే వరకు ప్రీమియం కట్టాలి. ఆ తర్వాత ప్రతి నెల రూ.3 వేల చొప్పున పింఛను వస్తుంది. ఒకేసారి డబ్బులు కావాలనుకుంటే రైతు కట్టిన, సర్కారు చెల్లించిన మొత్తంలో సగం ఒకేసారి అందజేస్తారు.

నిర్దేశిత తేదీ ప్రకారం చెల్లిస్తేనే.. -కె.దామోదర్‌రెడ్డి, ఏడీఏ, నర్సంపేట

లబ్ధిదారు మరణిస్తే జీవిత భాగస్వామికి సగం పింఛను రూ.1500 ఇస్తారు. పథకాన్ని కొనసాగించేందుకు కనీసం అయిదేళ్లపాటు రైతు వాటా నెలవారీ కిస్తీలను నిర్దేశిత తేదీ ప్రకారం చెల్లించాలి.

షట్లర్ శ్రీచేతన్‌శౌర్యకు రెండో ర్యాంకు



వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా సబ్ జూనియర్(అండర్-13) బ్యాడ్మింటన్ ర్యాంకింగ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా క్రీడాకారుడు శ్రీచేతన్‌శౌర్య తన స్థానాన్ని మెరుగుపర్చుకున్నాడు. బాలుర డబుల్స్ విభాగంలో 2వ స్థానంలో, సింగిల్స్‌లో 4వ స్థానంలో నిలిచాడు. ఇటీవల జరిగిన పలు జాతీయస్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించి.. వ్యక్తిగత ర్యాంకింగ్‌లో దూసుకెళ్లాడు. హనుమకొండలోని పెద్దమ్మగడ్డకు చెందిన శ్రీచేతన్‌శౌర్య ఆటతీరు అభినందనీయమని వరంగల్ బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి రమేష్‌రెడ్డి, సంఘం ప్రతినిధులు డా.రమేష్‌కుమార్, నాగకిషన్ పేర్కొన్నారు.

అమ్మ కోసం.. సాంకేతిక బాట

యాప్‌పై శిక్షణకు శ్రీకారం

ఇంట్లో కూతురు/కోడలు గర్భం దాల్చితే వారి బాగుగోలను పెద్దవాళ్లు చూసుకుంటారు. ఇప్పుడిక ట్రెండ్ మారుతోంది. రానున్న రోజుల్లో ఆధునికత చేదోడు కానుంది. సాంకేతిక బాట పట్టిన గర్భ సంరక్షణ ప్రస్తుతం అందరి దృష్టిని ఆకట్టుకుంటోంది. నేషనల్ హెల్త్ మిషన్, యునిసెఫ్ భాగస్వామ్యంతో అర్మన్ అనే స్వచ్ఛంద సంస్థ రూపకల్పన చేసిన 'అమ్మ కోసం' యాప్ ప్రయోజనకరంగా మారనుంది. ఇది గర్భిణులు, బాలింతలు, పిల్లల శ్రేయస్సుకు దోహదపడుతుంది.

అమ్మ కోసం యాప్‌ను అమలు చేయడానికి ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఆరు జిల్లాల పరిధిలోని వైద్య ఆరోగ్యశాఖల ఆధ్వర్యంలో ఏఎన్ఎంలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఇటీవల ప్రారంభించారు.

-న్యూస్‌టుడే, డోర్నకల్

ఆరోగ్య కల సాకారం

అరచేతిలో స్మార్ట్‌ఫోన్ ఇమిడి ఉంది. దైనందిన జీవితంలో ఒకటిగా మారింది. ఇప్పుడు 'అమ్మ-కోసం' యాప్ పురుడు పోసుకోవడంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఆరోగ్య సంబంధ అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చే ప్రధాన వనరుగా మారింది. గర్భధారణ సమయంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడం ఎలా? పిండం ఎదుగుదలను పర్యవేక్షించడం ఎలా?.. తదితర అంశాలను తెలుసుకునే వీలుంది. లోపాలుంటూ వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేలా వైద్య సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు.

డౌన్‌లోడ్ ఇలా..

గూగుల్ ప్లేస్టోర్‌లో అమ్మ-కోసం యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. అవసరమైన అనుమతులు అంగీకరించాక లాగిన్ ప్రక్రియని కొనసాగించాలి.

☛ యూజర్ నేమ్, పాస్‌వర్డు నమోదు చేసి 'రిమెంబర్ మీ' చెక్‌బాక్స్ మీద నొక్కాలి.

☛ తెరపై ఐహెచ్ఆర్‌పీటీఎం పేరిట 'డ్యాష్‌బోర్డు' కనిపిస్తుంది.

☛ బ్యాక్ గ్రౌండ్‌లో చూపిన విధంగా ఆఫ్‌లైన్‌లో ఉపయోగించుకునేందుకు అన్ని కోర్సు-లెసన్ ఫైళ్లని సైతం డౌన్‌లోడ్ చేస్తుంది. ఒకవేళ ఆటోమెటిక్‌గా డౌన్‌లోడ్ కాని పక్షంలో 'సింక్ ఐకాన్'పై క్లిక్ చేస్తే డౌన్‌లోడ్ అవుతుంది.

ఇవీ ప్రయోజనాలు..

☛ లెర్నింగ్ మేనేజ్‌మెంటు సిస్టం(ఎల్ఎంఎస్) ద్వారా పీడీఎఫ్, వీడియో, ఆడియో, ఇమేజ్ వివిధ ఫార్మాట్లలో కోర్సు పాఠాల వీక్షణకు ఇది వీలు కల్పిస్తుంది.

☛ కోర్సు లెసన్ ఫైళ్లలోకి వెళితే.. ప్రస్తుతం పురోగతిలో ఉన్న వాటితో పాటు ప్రారంభించని కోర్సుల జాబితా కనిపిస్తుంది. చిట్కాలు అందిస్తుంది

☛ ప్రసవానికి ముందు, తర్వాత చేయాల్సిన వ్యాయామాలను ఇది సూచిస్తుంది

☛ మంచి పోషణకు ఆహారాన్ని తీసుకోవడంలో తోడుంటుంది

☛ బాలింతలకు అవసరమైన సూచనలు చేస్తుంది

☛ పిల్లల విషయంలో జాగ్రత్తలను తెలుపుతుంది.

ఉమ్మడి జిల్లా స్వరూపం

జిల్లా	గర్భిణులు	బాలింతలు	పిల్లలు
మహబూబాబాద్	4930	3943	44837
జయశంకర్ భూపాలపల్లి	2653	2431	24476
హనుమకొండ	4231	3987	45552
వరంగల్	6128	6432	50423
జనగామ	3396	2430	23643
ములుగు	2874	2497	21624

గర్భిణులకు మేలు

- డా.మధుసూదన్, జిల్లా వైద్యాధికారి, శ్రీదేవి, జిల్లా ప్రోగ్రాం అధికారి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

అమ్మ-కోసం యాప్ గర్భిణులకు ఒక కల్పతరువు. హైరిస్క్ గర్భిణులు తీసుకోవాల్సిన చర్యలపై ఏఎన్ఎంలకు అవగాహన కల్పిస్తున్నారు. వీటిలో గర్భస్థ సమయంలో కొవిడ్, రక్తహీనత, అధిక రక్తపోటు, ప్రసవ పూర్వ రక్తస్రావం, మధుమేహం, గత సిజేరియన్ స్థితి, పిండం ఎదుగుదల ముఖ్యమైనవి. యాప్‌ను ఏఎన్ఎంల ట్యాబ్‌లలో డౌన్‌లోడ్ చేశారు. పదిహేను రోజులకు ఒకసారి ఒక్కో అంశంపై వీరికి ఒక లింక్‌ను ఆడియో/వీడియో రూపంలో పంపిస్తారు.

తెలుగులో సులభంగా అర్థం అవుతుంది

- సీహెచ్ స్వప్న, ఏఎన్ఎం, భూపాలపల్లి



అమ్మ కోసం యాప్ తెలుగులో ఉండటంతో సులభంగా అర్థమవుతోంది. శిక్షణలో గర్భిణులు, వారు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు, చికిత్సకి సంబంధించిన అంశాలను వివరించారు.



భూపాలపల్లిలో శిక్షణకు హాజరైన ఏఎన్ఎంలు

'కల్వకుంట్ల కుటుంబం ఆస్తుల వివరాలు ప్రకటించాలి'

జనగామ, న్యూస్‌టుడే: 'కల్వకుంట్ల కుటుంబానికి నిజాయతీ ఉంటే, 2014లో మీ ఆస్తులు ఎన్ని, ఇపుడెన్ని? అనే వివరాలను ప్రకటించాలని' మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సవాల్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, కవిత, సంతోష్, హరీశ్‌రావులు అధికార కూటమిగా మారి దోపిడి చేశారని ఆరోపించారు. జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం సందర్భంగా విపణిలో సోమవారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఎంపీ కడియం కావ్య, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్న సభలో శ్రీహరి మాట్లాడుతూ.. గడిచిన పదేళ్లలో కమిషన్ల కోసం పనులు తప్ప, అభివృద్ధి జరగలేదని, అందుకే ప్రస్తుతం సమస్యలు పేరుకున్నాయని విమర్శించారు. తాను భారాసలో ఉన్నప్పుడు విద్య, ఉపాధిపై సమీక్షకు గంట సమయం ఇవ్వలేదని, ప్రజా సమస్యలపై మాట్లాడితే తనను పక్కన పెట్టారని ఆరోపించారు. డీఎస్సీ ప్రక్రియను ఆరు మాసాల్లో విజయవంతంగా పూర్తి చేసి 11 వేల కుటుంబాల్లో సీఎం వెలుగులు నింపారన్నారు. భాజపా నాయకత్వం ఆధిపత్యం కోసం కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రఘునందన్‌రావు, ఈటల పోటీపడుతున్నారన్నారు. మూసీ, హైడ్రా విషయంలో వారి మాటల్లో పొంతనలేదని, ఒక్కనాడైనా కలిసి ఈ అంశాలపై స్పష్టతనిచ్చారా? అని ప్రశ్నించారు. రూ.7 లక్షల కోట్ల అప్పులతో ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, హామీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం గొప్ప సంకల్ప బలంతో ముందుకు వెళ్తోందని వివరించారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

వరంగల్ క్రీడావిభాగం : వరంగల్ చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో రాష్ట్రస్థాయి చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణ ప్రతినిధి కన్నా తెలిపారు. హనుమకొండలోని తితిదే వేడుకల మందిరంలో అండర్-15 విభాగంలో బాలబాలికలకు పోటీలు ఉంటాయన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై పోటీలను ప్రారంభిస్తారన్నారు. తొలి నాలుగు స్థానాల్లో నిలిచే బాలబాలికలు తమిళనాడులో జరిగే జాతీయస్థాయిలో పాల్గొంటారని చెప్పారు.

డమ్మీ తుపాకితో బెదిరించిన దుండగుడికి దేహశుద్ధి



నిందితుడు

దామెర, న్యూస్‌టుడే: డబ్బులివ్వాలని డమ్మీ తుపాకితో కిరాణ దుకాణం యజమానిని బెదిరించిన వ్యక్తికి గ్రామస్థులు దేహశుద్ధి చేసిన సంఘటన హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడు కందికొండ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఊరుగొండకు చెందిన సంపత్ జాతీయరహదారి పక్కన కిరాణ దుకాణం నిర్వహిస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి దుకాణం షట్టర్‌ను తట్టి బిస్కెట్ ప్యాకెట్ కావాలని కోరాడు. దీంతో సంపత్ షట్టర్ తెరవగానే.. దుండగుడు డమ్మీ తుపాకి చూపించి డబ్బులివ్వకపోతే చంపేస్తానని బెదిరించాడు. తన వద్ద డబ్బులు లేవంటూ సంపత్ భయంతో కేకలు వేశారు. స్థానికులు వచ్చి ఆ వ్యక్తిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సంపత్ తెలిపారు. దుండగుడు గతంలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తెలిసింది. నిందితుడిని విచారిస్తున్నట్లు ఎస్సై అశోక్ పేర్కొన్నారు.

పాఠశాలలో సార్వత్రిక ప్రవేశాలు షురూ!

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: ఖిలావరంగల్ మధ్యకోట ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో ప్రవేశాలు ప్రారంభమైనట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా కో-ఆర్డినేటర్ మూరాల శంకరరావు తెలిపారు. సోమవారం ప్రవేశాల ప్రచార గోడపత్రికలను ఆవిష్కరించారు. ఇతర వివరాలకు పాఠశాలల అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ శైలేంద్రకుమార్ 96034 86850 సంప్రదించాలన్నారు.

ప్రజాసేవలో పోలీసులు ముందుంటారు



స్మృతి పరేడ్‌లో పోలీసుల నివాళి

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రజాసేవలో పోలీసులు ముందుంటారని అమరుల ఆశయ సాధనకు పనిచేస్తూ విధుల్లో రాణించాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా అన్నారు. సోమవారం కమిషనరేట్‌లో అమరవీరుల స్తూపం వద్ద పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవాన్ని (ఫ్లాగ్‌డే) నిర్వహించారు. గతేడాది నుంచి ఇప్పటి వరకు దేశంలో విధి నిర్వహణలో మృతి చెందిన 241 మంది పోలీసు అమరుల పేర్లను అదనపు డీసీపీ రవి చదివి వినిపించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద, హనుమకొండ కలెక్టర్ ప్రావిణ్య, కర్నల్ రవికుమార్, డీసీపీలు షేక్ సలీమా, రవీందర్‌తో పాటు ఏసీపీలు ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐ, పోలీసు అమరుల కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు సిబ్బంది అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. ఆర్ఐ స్పర్జన్ సారథ్యంలో సాయుధ పోలీసుల శోకశ్రస్త చేసి మరణించిన పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ ప్రజల సేవ కోసం తమ ప్రాణాలను అర్పించిన పోలీసులు త్యాగధనులన్నారు. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు పనిచేయాలన్నారు. నీతి నిజాయతీతో పనిచేస్తే గుర్తింపు ఉంటుందన్నారు. అమరవీరులు ఎల్లప్పుడూ మన గుండెల్లోనే ఉంటారన్నారు. వారి కుటుంబాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వారికి ఎలాంటి సమస్యలున్నా పోలీసు విభాగం తరపున సహకారం అందిస్తామన్నారు. అనంతరం కమిషరేట్ నుంచి హనుమకొండ మిషన్ ఆసుపత్రి వరకు పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు కలిసి ప్రదర్శన నిర్వహించారు. పోలీసు జాగృతి కళా బృందం సభ్యులు పాల్గొని పోలీసు అమరులకు జోహార్లు అర్పించారు.



అమరవీరుల స్తూపం అలంకరణ



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా. చిత్రంలో పై వరుస(ఎడమ నుండి కుడికి) హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావిణ్య, సత్య శారద, ఎన్‌సీసీ కమాండెంట్ కర్నల్ రవీంద్ర కుమార్ రవి, డీసీపీలు షేక్ సలీమా, రవీందర్. కింది వరస పోలీసు ఉన్నతాధికారులు రవి, మధుసూదన్, నందిరాం నాయక్, సత్యనారాయణ, దేవేందర్ రెడ్డి

నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటా



శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్, చిత్రంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, తదితరులు

పాలకుర్తి, న్యూస్‌టుడే: జనగామ జిల్లా పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నం చేసి, మృతి చెందిన లకావత్ శ్రీను కుటుంబ సభ్యులను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ పరామర్శించారు. పాలకుర్తి మండలం మేకలతండాలోని శ్రీను నివాసాన్ని ఆయన సోమవారం సందర్శించి, విలేకరులతో మాట్లాడారు. శ్రీను మృతి ప్రభుత్వ హత్య అని అభివర్ణించారు. గిరిజన బిడ్డ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని వివరించారు. కాంగ్రెస్ నేత యాకాంతరావు ప్రమేయం ఈ ఘటనలో ఉందని తెలిసిందని, పోలీసులు ఉన్నా, అందరికీ శిక్ష పడేలా సీపీ, డీసీపీతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుని, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పారు. పోలీసులు విధుల పట్ల అంకితభావంతో పని చేయాలని, నాయకులకు ఒత్తాసు పలకడం సరికాదని అసహనం వ్యక్త చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, భాజపా జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామ్మోహన్‌రెడ్డి, తండావాసులు గాంధీ నాయక్, సురేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం



పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్న మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ డా.సత్యశారద తదితరులు

ఎనుమాముల మార్కెట్: రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. వరంగల్ జిల్లా మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో ఎనుమాముల మార్కెట్ యార్డులో సోమవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన పత్తిని తీసుకొచ్చి.. గరిష్ఠ ధరను పొందాలన్నారు. తేమ వల్ల రైతులు నష్టపోకుండా పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా కమిటీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అనంతరం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ తొలివిడతలో వరంగల్ జిల్లాలోని 14 కేంద్రాల్లో సోమవారం పత్తి కొనుగోళ్లు ప్రారంభించామని వరంగల్ కలెక్టర్ డా.సత్యశారద పేర్కొన్నారు. మిగతా చోట్ల త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సీసీఐ డిప్యూటీ మేనేజర్ అర్జున్ దవే, జేడీఎం శ్రీనివాస్, డీడీఎం పద్మావతి, డీఎంఓ సురేఖ, మార్కెట్ కార్యదర్శి నిర్మల, స్థానిక కార్పొరేటర్లు, అధికారులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

ప్రతిభకు ప్రోత్సాహం.. విజేతలకు పురస్కారం



స్థానిక సాన్‌మేరియా హైస్కూల్లో 'ఈనాడు' ప్రతిభాపాటవ వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు



విజేతలతో ఉపాధ్యాయులు

జనగామ, న్యూస్‌టుడే: చదువుతో పాటు, ఇతర అంశాల్లో విద్యార్థులు రాణించాలంటే వారికి ప్రోత్సాహం అవసరం. వారిలో దాగి ఉన్న ప్రతిభా నైపుణ్యాలకు తగిన వేదిక కల్పిస్తే అనుబంధ రంగాల్లో వారు రాణిస్తారు. విద్యార్థుల సర్వతోముఖ వికాసానికి పాదులు వేసే కార్యక్రమంలో భాగంగా 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వివిధ అంశాలలో ప్రతిభా పాటవ పోటీలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జనగామ జిల్లా కేంద్రంలోని సాన్ మేరియా హైస్కూల్లో సోమవారం విద్యార్థులకు 'అంతర్జాల వినియోగం, సెల్‌ఫోన్ ప్రతికూలతలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీని నిర్వహించారు. 7, 9, 10వ తరగతుల విద్యార్థులు ఆంగ్లం, తెలుగు మాధ్యమాల్లో వ్యాసాలను రచించారు. జి. తేజస్విని ప్రథమ, ఇన్నియారాజ్ ద్వితీయ, శ్రతజా మైత్రి తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. బహుమతి ప్రదానంలో ప్రిన్సిపల్ జి. రాధాకృష్ణ, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బి. మధు, ఉపాధ్యాయులు డి. శిల్ప, కె. అను, ఎన్. సందీప్ పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన ఓటరు జాబితా రూపకల్పన



అవగాహన కార్యక్రమాల ప్రచార పత్రికలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

జనగామ, న్యూస్‌టుడే: వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రణాళిక బద్ధంగా ఓటరు జాబితా సవరణ, ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు జిల్లా పాలనాధికారి రిజ్వాన్ బాషా పేర్కొన్నారు. ఓటరు జాబితా తయారీపై సోమవారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి దృశ్య శ్రవణ మాధ్యమ సమావేశాన్ని హైదరాబాద్ నుంచి నిర్వహించారు. జిల్లా సచివాలయం నుంచి జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఓటర్ల నమోదు దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశించినట్లు వివరించారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 2730 దరఖాస్తులు పెండింగులో ఉన్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పత్రికలను కలెక్టర్ జిల్లా సచివాలయంలో ఆవిష్కరించారు. ఆర్డీవో కొమురయ్య, డీఆర్వో వసంత పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్‌కు అభినందన



జనగామ, న్యూస్‌టుడే: జనగామ నూతన సబ్‌రిజిస్ట్రార్‌గా విధుల్లో చేరిన అమ్జద్ అలీని స్థానిక ప్లానర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలిశారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయనను కలిసి అభినందనలు తెలిపినట్లు వారు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

జనగామ: 80085 74872
జనగామ అర్బన్: 80749 20132
పాలకుర్తి: 98663 66702
స్టేషన్‌ఘన్‌పూర్: 90521 83243
జఫర్‌గఢ్: 98662 50618

తరిగొప్పుల, న్యూస్‌టుడే: మండలంలోని వావిళ్లతండా ప్రధాన రహదారి పక్కన పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ఇళ్లలోకి దోమలు విజృంభిస్తున్నాయి. పరిష్కరించాలి. - కాలనీవాసులు

సమాధానం: రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం. - వీరం, పంచాయతీ కార్యదర్శి

మట్టికుప్పల తొలగింపు

స్పందనకు వందనం

పాలకుర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై ఇసుక, మట్టి పేరుకుపోవడంతో వాహనాలకు ఇబ్బందికరంగా ఉందని స్థానికులు ఫోన్ ద్వారా 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. సమస్యపై పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు స్పందించి, సిబ్బందితో తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



శివరామ్‌కార్తీక్

జనగామ, న్యూస్‌టుడే: జనగామ గౌతమ్ మోడల్ స్కూల్ విద్యార్థి దండు శివరామ్‌కార్తీక్ 68వ ఎస్జీఎఫ్ జనగామ జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభను ప్రదర్శించి ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఆ పోటీల్లో ఉత్తమ ప్రతిభను ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలని పాఠశాల యాజమాన్యం సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించింది.

జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజు



పాలకుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని వల్మిడికి చెందిన వీరమల్ల రాజు మున్నూరుకాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య, జిల్లా అధ్యక్షుడు పోగు సారంగపాణి చేతుల మీదుగా సోమవారం హైదరాబాద్‌లో నియామకపత్రాన్ని అందుకున్నారు. తన ఎన్నికకు సహకరించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి గంగుల కమలాకర్, నాయకులకు రాజు కృతజ్ఞతలు తెలిపారు.



జనగామ జిల్లా కేంద్రంలో నివాళులు అర్పిస్తున్న పోలీసులు



నర్మెట్టలో..



లింగాలఘనపురంలో..



కొడకండ్లలో..

పోలీసు అమరవీరులకు నివాళులు

జనగామ టౌన్, కొడకండ్ల, నర్మెట్ట, లింగాలఘనపురం, న్యూస్‌టుడే: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. బస్టాండ్ చౌరస్తాలో ఉన్న పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద రాత్రి జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జనగామ ఏసీపీ పార్థసారధి మాట్లాడుతూ.. ప్రజా భద్రత కోసం పని చేస్తూ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరుల స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అబ్బయ్య, ఎస్సైలు హమీద్, రాజేష్, రాజన్‌బాబు, శ్వేత, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంతోనే లోప రుగ్మతల బారిన పడుతున్నారు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో రవీందర్ గౌడ్

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: అయోడిన్ లోపంతో ప్రజలు అనేక లోప రుగ్మతల బారిన పడుతున్నారని జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి. రవీందర్ గౌడ్ అన్నారు. ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా వైద్యాధికారి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ప్రతిరోజు వ్యక్తి ఐదు గ్రాముల అయోడైజ్డ్ ఉప్పును వాడాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధీర్‌కుమార్, సూపరిటెండెంట్ సంధ్య, మెడికల్ అధికారులు సంధ్య, అజయ్, ప్రదీప్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఉపకేంద్రాలకు నిరంతర విద్యుత్తు



పరిశీలిస్తున్న డీఈ రాంబాబు, తదితరులు

కొడకండ్ల, న్యూస్‌టుడే: గ్రామాలకు విద్యుత్ సరఫరాను అందించే 33-11 కె.వి ఉప కేంద్రాలకు నిరంతర సరఫరా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు స్టేషన్‌ఘన్‌పూర్ డీఈ వై. రాంబాబు తెలిపారు. సోమవారం కొడకండ్లలోని ఉప కేంద్రాన్ని ఆయన సందర్శించి, రికార్డులు పరిశీలించారు. ఉపకేంద్రంలో సిబ్బంది వసతులు, సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బిల్లుల బకాయిల వసూలుపై సిబ్బంది శ్రద్ధ చూపాలని సూచించారు. ఆయన వెంట ఏఈ రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతుల పరిశీలన



17వ వార్డులో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

జనగామ, న్యూస్‌టుడే: వర్షాలతో పట్టణంలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు డీఈ చంద్రమౌళితో కలిసి సోమవారం స్థానిక 3, 17వ వార్డుల్లో పర్యటించి, పలు సూచనలు చేశారు. కాల్వల్లో మురుగు తొలగించాలని, అంతర్గత రహదారుల గుంతలను పూడ్చాలని సూచించారు.

సహాయనిధి చెక్కుల అందజేత



జనగామ, న్యూస్‌టుడే: వైద్య సహాయం కోసం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న ఇద్దరు బాధితులకు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఎల్వోసీ పత్రాలను మంజూరు చేయించి, అందజేశారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో నర్మెట్ట మండలం ఇప్పలగడ్డ వాసి బి. నారాయణకు రూ. 1.50 లక్షలు, ఇదే మండలం సోలిపురం గ్రామస్థుడు టి. బాలరాజుకు రూ. 75వేల ఎల్వోసీ అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దయాకర్‌రావుపై విమర్శలు సరికాదు

పాలకుర్తి, న్యూస్‌టుడే: మాజీ మంత్రి దయాకర్‌రావును విమర్శించే హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదని రాష్ట్ర గిరిజన సహకార సంస్థ మాజీ ఛైర్మన్ గాంధీ నాయక్, భారాస మండలాధ్యక్షుడు నవీన్ తెలిపారు. సోమవారం పాలకుర్తిలోని పార్టీ కార్యాలయంలో ఆయన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. లకావత్ శ్రీను మృతి విషయంలో రాజకీయం చేయడం సరికాదన్నారు. అధికార పార్టీ స్థానిక నాయకులు చిల్లర రాజకీయాలు చేయడం మానుకోవాలని విమర్శించారు. నాయకులు మాజీ ఎంపీపీ నాగిరెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గాంధీనాయక్

మహాసభలకు తరలిన ఐద్వా నాయకులు



జనగామ టౌన్, న్యూస్‌టుడే: కొత్తగూడెంలో సోమవారం నుంచి ప్రారంభమైన ఐద్వా రాష్ట్ర మహాసభలకు జనగామ నుంచి ఐద్వా ప్రతినిధులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇర్రి అహల్య, షబానా మాట్లాడుతూ.. మహాసభలు ఈ నెల 23 వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. సంఘం ప్రతినిధులు మోకు భవాని, కల్యాణి, రమాదేవి, అనిత, శ్రీలత, రాములమ్మ, కవిత, నిర్మల, కావ్య తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల సందర్శన



జనగామ టౌన్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సమ్మెటివ్ అసెస్మెంట్-1 పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమైనట్లు జిల్లా విద్యా శాఖ అధికారి రాము ఒక ప్రకటనలో తెలిపారు. జనగామ, రఘునాథపల్లి మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో డీఈవో పరీక్షలను పరిశీలించి, మాట్లాడారు. ఉపాధ్యాయులు రోజూ వారీగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో రఘునందన్, బాలికా విద్యా కోఆర్డినేటర్ గౌసియా, మెరుగు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



జనగామ టౌన్, న్యూస్‌టుడే: జీవో 29ను రద్దు చేసి పాత పద్ధతిలోనే గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం జనగామలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దడిగె సందీప్, జిల్లా మహిళా కన్వీనర్ సుమ మాట్లాడుతూ.. ఆన్సర్ షీట్‌లో యూపీఎస్సీ తరహాలో ప్రిలిమ్స్ హాల్‌టికెట్ నెంబర్ ముద్రించి మెయిన్స్ నిర్వహించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా పరీక్ష జరపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లవకుమార్, రమేష్, శ్రీనాథ్, కీర్తన, మానస, మురళి, స్నేహ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రాజు (పాత చిత్రం)

పాలకుర్తి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం పాలకుర్తి మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై లింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. . వరంగల్ జిల్లా గీసుకొండ మండలం నంద్యాతండాకు చెందిన బదావత్ రాజు(20), అతని స్నేహితుడు బదావత్ సతీశ్‌తో కలిసి ద్విచక్రవాహనంపై పాలకుర్తికి వస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం నాంచారిమడూరు ప్రధాన రోడ్డు మీదుగా పాలకుర్తికి వచ్చే క్రమంలో వావిలాల శివారు నారబోయినగూడెం వద్ద వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొంది. క్రమంలో ఇరువురికి తీవ్ర గాయాలు కాగా, రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. సతీశ్‌ను హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

దాడిపై కేసు నమోదు

చిల్పూర్, న్యూస్‌టుడే: మండలంలోని దేశాయితండాకు చెందిన భూక్య వాలీ అనే మహిళపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భూక్య కాశీనాథ్‌కు తన బాబాయి యాదగిరికి కొద్ది రోజుల కిందట ఇల్లు విషయంలో గొడవ జరిగింది. అది మనసులో పెట్టుకున్న యాదగిరి సోమవారం వాగ్వాదానికి దిగి కాశీనాథ్‌పై కర్రతో దాడి చేసేందుకు రాగా అడ్డు వెళ్లిన కాశీనాథ్ తల్లి వాలీ తలకు తగిలి బలమైన గాయమైంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని ఒకరి ఆత్మహత్య

పాలకుర్తి, న్యూస్‌టుడే: పాలకుర్తి మండలంలోని మైలారం శివారులో వ్యవసాయ కొట్టం వద్ద సోమవారం గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్సై లింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఓ రైతు వ్యవసాయ క్షేత్రం వద్ద సుమారు 60 ఏళ్లు ఉన్న వ్యక్తి ఉరేసుకొని ఆత్యహత్య చేసుకున్నాడన్నారు. స్థానికులు గమనించి, పోలీసులకు సమాచారం అందించగా, శవాన్ని పరిశీలించి కేసు నమోదు చేశామన్నారు. ఒంటిపై దుస్తులు తప్ప ఎలాంటి ఆధారాలు లేవన్నారు. మృతదేహాన్ని జనగామ ఏరియాసుపత్రికి తరలించామని వివరించారు.

బాలుడిపై శునకం దాడి

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ఫత్తేషాపురంలో సోమవారం శునకం బాలుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. స్థానికుల కథనం ప్రకారం.. చిన్నారి కిరాణం దుకాణానికి వెళ్తుండగా కుక్క దాడి చేసింది. కుటుంబ సభ్యులు బాలుడిని జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు.

గొలుసు దుకాణాలు తొలగించాలని వినతి

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ పట్టణంలో నడుస్తున్న మద్యం గొలుసు దుకాణాలను తొలగించాలని కుల వివక్ష పోరాట సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్లు ఆ సంఘం పట్టణ కార్యదర్శి బొట్ల శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని 30 వార్డుల్లో వార్డుకో మద్యం గొలుసు దుకాణం నడుస్తోందని, ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని వివరించామన్నారు. అలాగే దేవరుప్పుల మండలం చిన్నమడూరులో దళితులకు కేటాయించిన భూములకు హద్దులు పెట్టాలని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

ధర్మయుద్ధ సభను జయప్రదం చేయాలి

జనగామ టౌన్, న్యూస్‌టుడే: ఈనెల 26న వరంగల్‌లో నిర్వహించనున్న ఉమ్మడి వరంగల్ జిల్లా మాదిగల ధర్మయుద్ధ సభను జయప్రదం చేయాలని ఎంఎస్పీ జాతీయ నాయకులు మందకుమార్ మాదిగ అన్నారు. పట్టణంలోని ఓ వేడుకల మందిరంలో కిషోర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో మందకుమార్ మాట్లాడుతూ.. వర్గీకరణకు మద్దతుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో హామీ ఇచ్చి, కమిషన్ల పేరిట కాలయాపన చేస్తున్నారని దుయ్యబట్టారు. ధర్మయుద్ధ సభకు మాదిగలు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. సమావేశంలో నాయకులు భిక్షపతి, దయాకర్, సూరన్న, సతీష్, కొయ్యడ మల్లేష్, రాగల్ల ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యకు ప్రోత్సాహం.. ఉపాధికి సహకారం



విద్యార్థికి సైకిల్, మహిళకు కుట్టుమిషన్ అందిస్తున్న ప్రతినిధులు

కొడకండ్ల, న్యూస్‌టుడే: ఉన్నత పాఠశాల విద్యకై నిత్యం 5 కి.మీ దూరం గిరిజన తండా నుంచి కాలినడకన పాఠశాలకు వస్తున్న విద్యార్థికి సైకిల్ అందించి, పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న ఓ మహిళకు ఉపాధికై కుట్టుమిషన్ అందించి లయన్స్ క్లబ్ ప్రతినిధులు అభినందనలందుకొన్నారు. సోమవారం కొడకండ్లలో కడగుట్ట తండాకు చెందిన ధరావత్ శిరీష అనే బాలికకు, కొడకండ్లకు చెందిన నిరుపేద మహిళ పల్లె యాకలక్ష్మికి కుట్టుమిషన్ పంపిణీ చేశారు కొడకండ్ల లయన్స్‌క్లబ్ ప్రతినిధులు. దాతృత్వం ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలని కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు పేర్కొన్నారు.

తప్పుల తడకగా ఓటరు జాబితా

జఫర్‌గడ్, న్యూస్‌టుడే: మండలంలోని రేగడితండాలోని ఓటరు జాబితాలో రాజకీయ నాయకుల ప్రోత్సాహంతో పంచాయతీ కార్యదర్శి అవకతవకలకు పాల్పడినట్లు తండాకు చెందిన యువకులు రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. రేగడితండా పంచాయతీ పరిధిలో 8 వార్డులు ఉండగా ఈ పంచాయతీ పరిధిలో టీబీ, కేజీతండాలు ఉన్నాయి. రేగడితండాలో ఒకటో వార్డులో ఉన్న కుటుంబాలను 2, 3 వార్డుల్లో చేర్పించారని చెప్పారు. ఓటరు జాబిత తప్పుల సవరణ కోసం ఎలాంటి దండోరా, నోటీసు బోర్డు పెట్టకుండా పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు పంపిన వినతి పత్రంలో పేర్కొన్నారు.

గుడుంబా విక్రయిస్తున్న ఒకరి బైండోవర్



కొమురయ్యను బైండోవర్ పత్రం చూపిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది యాకలక్ష్మి

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: గుడుంబా విక్రయిస్తూ పట్టుబడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఎదుట బైండోవర్ చేసినట్లు అబ్కారీ సీఐ జి. భాస్కర్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని రంగరాయిగుడెం గ్రామానికి చెందిన మంద కొమురయ్య గుడుంబా విక్రయిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు వివరించారు. మరోసారి పట్టుపడితే రూ. లక్ష జరిమానా లేదా జైలుకు పంపించడం జరుగుతోందని పేర్కొన్నారు.

సంక్షిప్తంగా

ఆలయాభివృద్ధికి విరాళం అందజేత

నర్మెట్ట, న్యూస్‌టుడే: నర్మెట్టలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికై మండలానికి చెందిన బండి రాజు, రమణ సోదరులు రూ. 20116 విరాళాన్ని సోమవారం కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు జంగిటి అంజయ్య, బిజ్జ సత్యనారాయణ, జి. ఉపేందర్, బాలయ్య, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పాలకుర్తి, న్యూస్‌టుడే: పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఆత్మహత్య చేసుకున్న లకావత్ శ్రీను కుటుంబ సభ్యులకు దాతలు సోమవారం అండగా నిలిచారు. ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ పరుపాటి శ్రీనివాసరెడ్డి రూ. 20 వేలు, గిరిజన యువకులు, నాయకులు రూ. 5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ప్రభుత్వం స్పందించి ఎక్స్‌గ్రేషియా అందించాలని రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షుడు సురేంద్ర నాయక్ డిమాండ్ చేశారు.

టీపీఈటీఎఫ్ మండలాధ్యక్షుడిగా రమేశ్



లింగాలఘనపురం, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ టెక్నీషియన్ ఫెడరేషన్ (టీపీఈటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు కుమార్ ఆధ్వర్యంలో సోమవారం మండల కమిటీ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా గట్టగల్ల రమేశ్, ఉపాధ్యక్షుడిగా ఎడ్ల వసంత్, కార్యదర్శిగా వెంకటేశ్ ఎన్నికయ్యారు. అధ్యక్షుడు కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు లేబర్ కార్డు పొందాలని, రెగ్యులర్‌గా రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో యాకేష్, బొంకూరి రమేష్, బోయిని సత్యనారాయణ, సాయిబాబా, యాకయ్య, కూతాటి ఉప్పలయ్య పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి ఎంపిక

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి ఎంపిక క్రీడల్లో లింగాలఘనపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చూపి జిల్లాస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్, పీడీ కిష్టయ్య తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో 8వ తరగతి విద్యార్థులు భవాని, రుష్మిత, దీక్షత బాలుర విభాగంలో 9వ తరగతి విద్యార్థి దుర్గాప్రసాద్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

తరిగొప్పుల, న్యూస్‌టుడే: పార్టీ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వగలబోయిన యాదగిరి అన్నారు. సోమవారం తరిగొప్పులలో స్థానిక నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ మండల సోషల్ మీడియా మాజీ అధ్యక్షుడు కొయ్యాడ రాజు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, అందు వల్ల సస్పెండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పండుగ కనకయ్య, బృంగి శివకుమార్, చంద్రయ్య, నరహరి, లూక, తదితరులు పాల్గొన్నారు.